## క్లుప్తంగా

### మంత్రికి కృతజ్ఞతలు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వీఆర్ఏలు

**ధర్మారం:** వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేస్తూ సీఎం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం ధర్మారం మండల వీఆర్ఏలు మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు భీమయ్య, నాయకులు సత్యం, ఎదుల్ల అంజయ్య, శ్రావణ్, సుధాకర్, మానస పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**కమాన్‌పూర్:** మండలంలోని జూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తంతనపల్లి రక్షిత తండ్రి తంతనపల్లి అశోక్ గుండారం గ్రామ శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తల్లి, చెల్లి, తమ్ముడు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వైద్యఖర్చుల కోసం అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ వారు ఆదివారం రూ.50వేలు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు వేణు మాధవ్, కోశాధికారి తిరుపతి పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పిల్లిపల్లెలో నిర్మించిన ముత్యాల పోచమ్మ గుడికి సుందరం ఫౌండేషన్ ఫౌండర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బోనాల వెంకటస్వామి రూ.5వేలు అందజేశారు.

### పుస్తెమెట్టెలు బహూకరణ



పుస్తెమెట్టెలు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**ధర్మారం:** ధర్మారంలోని గణేశ్‌నగర్‌కు చెందిన నిరుపేద శాంతమ్మ కూతురు ప్రశాంతి వివాహానికి ద్యాగేటి ఉదయ్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం కుటుంబసభ్యులకు ఆదివారం పుస్తెమెట్టెలతో పాటు 50కిలోల బియ్యం అందించారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ పెరుమాండ్ల ప్రసాద్, సభ్యులు ఈదుల శ్రీనివాస్, బొమ్మగాని సతీశ్, గుమ్ముల తిరుపతి, కొత్తకొండ రవీందర్, పాలకుర్తి వెంకటేశ్, రాజేశం, ప్రసాద్, మహేశ్, పరమేశ్ పాల్గొన్నారు.

### ఎల్లమ్మగుడికి మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న సదయ్య

**సుల్తానాబాద్‌రూరల్:** మండలంలోని కాట్నపల్లి రేణుక ఎల్లమ్మ గుడికి బీజేపీ నాయకుడు ఏగోలపు సదయ్యగౌడ్ ఆదివారం మైక్‌సెట్ అందించారు. సర్పంచ్ మోహన్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బాలయ్యగౌడ్, రాజుగౌడ్, మనోజ్‌గౌడ్, లచ్చయ్య తదితరులు ఉన్నారు.

### క్రీడాదుస్తులు పంపిణీ



టీషర్టులు పంపిణీ చేస్తున్న సభ్యులు

**జూలపల్లి:** సీఎం కప్ క్రీడాపోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ పంపిన క్రీడాదుస్తులను కేసీఆర్ సేవాదళం సభ్యులు ఆదివారం అందజేశారు. యూత్ జిల్లా కార్యదర్శి బొద్దుల సాయినాథ్, సేవాదళం సభ్యులు శ్రీనివాస్, జెట్టి సతీశ్, ఎర్రోల్ల రాములు, రాయనవేణి శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, అంతయ్య, గుమ్మడి స్వామి, రాజయ్య, రాకేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన

**ఓదెల:** మండలంలోని పొత్కపల్లి, జీలకుంట గ్రామాల్లో భూలక్ష్మి బొడ్రాయి, పోచమ్మ, మదన గుడి, పోతరాజు దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ ఉత్సవాల్లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు.

# మల్లన్న చెంత.. నీటి చింత

- దాహార్తితో తల్లడిల్లుతున్న భక్తులు
- ఓదెల మల్లన్న దేవస్థానంలో సరిపోని మంచినీటి ట్యాంకులు
- నిరుపయోగంగా బోరింగులు
- దృష్టిసారించని ప్రజాప్రతినిధులు, అధికారులు



నిరుపయోగంగా ఉన్న బోరింగ్



తక్కువ సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు

**ఓదెల:** జిల్లాలోని ప్రముఖ దేవస్థానం ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో మంచినీటి ఎద్దడి నెలకొంది. జాతరకు నిత్యం ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్రతి బుధ, ఆదివారాల్లో జరిగే జాతర, మల్లన్న పట్నాల కోసం నిత్యం దర్శనం కోసం వేలసంఖ్యలో భక్తులు వస్తుటారు. ప్రస్తుతం దేవస్థానంలో నాలుగు మంచినీటి ట్యాంకులు ఉన్నాయి. భక్తులు స్నానాలు చేయడంతో పాటు తాగడానికి వంటలకు సరిపోవడం లేదని భక్తులు వాపోతున్నారు.

**ట్యాంకుల నిర్మాణం పెంచాలి..**

ప్రస్తుతం కోనేరు నిర్మాణం పూర్తయినప్పటికీ అందులో నీటి సౌకర్యం లేదు. దీంతో ట్యాంకుల కిందనే స్నానం చేస్తున్నామని భక్తులు చెప్తున్నారు. ఎండలు ముదరడం, భక్తుల రద్దీ పెరగడంతో మంచినీటికి కటకట ఏర్పడింది. చాలా ఏళ్లక్రితం నిర్మించిన ట్యాంకులు, తక్కువ సామర్థ్యం గల ట్యాంకులు కావడంతో భక్తులకు దాహార్తి తీరడం లేదు. గుడిలో మంచినీటి బావి ఉన్నప్పటికీ ట్యాంకుల నిర్మాణం పెంచితే తాగునీటికి ఇబ్బందులు తొలగుతాయని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. మంచినీటి ట్యాంకుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని భక్తులు కోరుతున్నారు.

**సరిపడా సౌకర్యాలు కరువు..**

జిల్లాలోనే ప్రముఖ గుడి కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కానీ సరిపడా సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దేవస్థానం ఆవరణలోని మంచినీటి బోరింగులు పనిచేయక చాలారోజులు గడిచినా మరమ్మతు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వాటికి వెంటనే మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. దేవస్థానంలో భక్తుల రద్దీకి అనుకూలంగా మంచినీటి ట్యాంకుల నిర్మాణం, అదనంగా బోరింగులు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రతిపాదనలు పంపాం



ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులకు సరిపడేలా 10వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాం. చాలా ఏళ్లక్రితం నిర్మించిన ట్యాంకులు కావడంతో భక్తులకు మంచినీరు సరిపోవడం లేదు. ఆలయ పరిసరాల్లో పనిచేయని బోరింగులను మరమ్మతు చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– మేకల మల్లేశంయాదవ్, ఆలయ చైర్మన్

### ట్యాంకులు చిన్నగా ఉన్నాయి



మల్లన్నగుడిలో మంచినీటి ట్యాంకులు నిర్మించాలి. ప్రస్తుతం ఉన్న ట్యాంకులు చిన్నవిగా ఉండటంతో భక్తులకు సరిపోవడం లేదు. భక్తుల రద్దీకి అనుగుణంగా ట్యాంకుల నిర్మాణం పెంచాలి. ప్రజాప్రతినిధులు పట్టించుకొని మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.

– జంగ రవి, భక్తుడు, కరీంనగర్

### సౌకర్యాలు కల్పించాలి



భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న ఓదెల మల్లన్న దేవస్థానంలో సౌకర్యాలు కల్పించాలి. కోనేరులో స్నానం చేయడానికి ఎలాంటి సౌకర్యాలు లేవు. అదేవిధంగా నీటిట్యాంకులు చిన్నగా ఉన్నాయి. బోరింగులు పనిచేయడం లేదు. భక్తుల రద్దీకి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలి.

– గాజుల్ల మోహన్‌రెడ్డి, రుద్రారం

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జూలపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



యైటింక్లయిన్‌కాలనీ: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



పాలకుర్తి: కుక్కలగూడూర్ ప్రభుత్వ పాఠశాలలో..

**జూలపల్లి:** మండల కేంద్రంలోని గోల్డెన్ ఫంక్షన్ హాలులో ఆదివారం 1994–95లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. సమ్మేళనానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. గంగయ్య, విజయలక్ష్మి, ముజ్జా, శ్రీనివాస్, చంద్రమౌళి, శ్రీమతి, అలేఖ్య, మల్లేశ్‌యాదవ్, రాజయ్య, అంజయ్య ఉన్నారు.

**1996–97 బ్యాచ్ విద్యార్థులు**

**యైటింక్లయిన్‌కాలనీ:** ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని స్పందన పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం యైటింక్లయిన్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను సన్మానించారు. కమాన్‌పూర్ ఎంఈవో సంపత్‌రావు, రాజమౌళి, సమ్మిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సారయ్య, శ్రీనివాస్, జగన్, శ్రీలత, అన్నపూర్ణ, పూర్వ విద్యార్థులు బూడిద సమ్మయ్య, పాషా, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రఫీక్, విజయ్, స్రవంతి, మంజుల, శోభ పాల్గొన్నారు.

**2003–04 బ్యాచ్ విద్యార్థులు**

**పాలకుర్తి:** మండలంలోని కుక్కలగూడూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003–04 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులందరూ గురువులను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం.జింక మల్లేషం, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవం



ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

**కమాన్‌పూర్:** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బొడ్రాయి సహిత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయిని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, జక్కు వర్షిణి హాజరై మొక్కులు చెల్లించారు. అనంతరం జెడ్పీ చైర్మన్‌లను కమిటీ సభ్యులు సన్మానించారు.

## ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ ర్యాలీ



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న డీఎంహెచ్‌వో

**పెద్దపల్లిరూరల్:** పట్టణంలో ఆదివారం రాత్రి ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ ర్యాలీని జిల్లా ప్రభుత్వాసుపత్రి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌వ్యాధి బారిన పడి మరణించిన వారి కుటుంబాలకు సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, వైద్యాధికారులు మహేందర్, శ్రావణ్, శంకర్, లావణ్య, ఐసీటీసీ కౌన్సిలర్ శంకర్ రాగినేడు, రాఘవాపూర్ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## అవినీతిని ప్రశ్నిస్తే దాడి చేస్తారా?

**పెద్దపల్లిరూరల్:** ప్రభుత్వ పథకాలలో అవినీతికి పాల్పడడంతో పాటు సహజవనరుల దోపిడీపై ప్రశ్నిస్తే తుంగతుర్తి నియోజకవర్గంలో న్యాయవాది యుగందర్‌పై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేస్తారా అని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ప్రశ్నించారు. పెద్దపల్లిలో ఆదివారం ఆమె మాట్లాడారు. తుంగతుర్తి ఎమ్మెల్యే అవినీతి అక్రమాలను ఆధారాలతో బయటకు తీస్తున్నాడనే అక్కసుతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. పోలీసులు అధికార పార్టీకి అండగా ఉంటూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని సరైన సమయంలో బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, రియాజ్, అరుణ, శారద, ప్రశాంత్, నరేశ్, నర్సయ్య, వరలక్ష్మి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మండలం చీకురాయి గ్రామానికి చెందిన మేకల రాజమ్మ (78) అనే వృద్ధురాలు ఆదివారం ప్రమాదవశాత్తు రైలు ఢీనొడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు బయట ఉన్న దుకాణంలో సామగ్రి కొని ఇంటికి వస్తుండగా ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు తెలిపారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు.

## నేటి నుంచి పూజలు ప్రారంభం

**ఫెర్టిలైజర్‌సిటీ:** రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీలో గ్రామ దేవతల విగ్రహాలు, బొడ్రాయి ప్రతిష్ఠ పూజలు సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ జెట్టి జ్యోతి–రమేశ్ తెలిపారు. గ్రామంలో శనివారం వరకు పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



పిల్లపల్లెలో పోచమ్మ బోనాలు

**కమాన్‌పూర్:** మండల కేంద్రంలోని పిల్లపల్లెలో ముత్యాల పోచమ్మ బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో బయలుదేరి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

## ధర్మారం గ్రామస్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి



పుట్ట మధును సన్మానిస్తున్న ధర్మారం గ్రామస్తులు

**మంథని:** మంథని మండలం గద్దలపల్లి గ్రామపంచాయతీ ధర్మారం వాసులు ప్రత్యేకంగా సమావేశమై వచ్చే ఎన్నికల్లో జెడ్పీచైర్మన్ పుట్ట మధును గెలిపించుకునేలా నిర్ణయం తీసుకున్నారు. ధర్మారం గ్రామస్తులు ఆదివారం జెడ్పీ చైర్మన్ పుట్టమధును సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ ధర్మారం వాసులు తీసుకున్న నిర్ణయాన్ని నియోజకవర్గమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైతే రూపాయి ఖర్చు లేకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలిపించుకుంటానని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



సుల్తానాబాద్: నివాళి అర్పిస్తున్న చిలుక సతీశ్



మంథని: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సుల్తానాబాద్:** పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నోముల శ్రీనివాస్‌రెడ్డి, పన్నాల రామన్న, రాజు, రాజయ్య, పర్శరాములు, రాజలింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**రామగుండంలో..**

**రామగుండం:** భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ అంతర్గాం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, ప్రతినిధులు పెంద్రు హన్మాన్‌రెడ్డి, గజ్జెల నాగరాజు, స్వామి, కాంపెల్లి సంతోష్, గౌస్‌బాబా, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీలో..**

**యైటింక్లయిన్‌కాలనీ:** రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, పెద్దపల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి నివాళి అర్పించారు. నాయకులు తిరుపతి, దేవనపల్లి చక్రపాణి, కిషన్ నాయక్, రాజు, అవినాష్, సునీత, మార్కండేయ, రాజేశం, శ్రీనివాస్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

**మంథని డివిజన్‌లో..**

**మంథని:** మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే సోదరుడు శ్రీనుబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, నాయకులు పోలు శివ, వొడ్నాల శ్రీనివాస్, ఇనుముల సతీశ్, అజీంఖాన్ ఉన్నారు.

**కమాన్‌పూర్‌లో..**

**కమాన్‌పూర్:** మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు, ఇక్బాల్, అప్సర్, గట్టయ్య, రఫీక్, రాజు, రమేశ్, రహీం, రాజయ్య పాల్గొన్నారు.

## ఆలయంలో భక్తుల సౌకర్యార్థం బోర్‌వెల్



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ బాలాజీరావు

**సుల్తానాబాద్:** ఆలయ భక్తుల సౌకర్యార్థం తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ బాలాజీరావు అన్నారు. పట్టణంలోని పూసాల శ్రీలక్ష్మీనారాయణ ఆలయంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సూచన మేరకు ఆదివారం పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. బోర్‌వెల్‌కు మోటార్ కావాలని గ్రామస్తులు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతను కోరగా ఇస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీ మాజీ సభ్యులు గుర్రాల మల్లేశం, మాజీ ఎంపీటీసీలు పురం ప్రేంచందర్‌రావు, కంకణాల ఆశాలు, నాయకులు రవి, గణేశ్, కంకణాల సతీశ్, పురం రమణ, వైద్య శివకృష్ణ, గొల్లపల్లి లక్ష్మీనారాయణ, చొప్పరి సుమన్, చొప్పరి లక్ష్మీనారాయణ, బాలల శేఖర్, రాపోలు రమేశ్, బండి నర్సయ్య ఉన్నారు.

## మెరుగైన విద్యుత్ ఉత్పత్తి అంశాలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో సదరన్ రీజియన్ అధికారులు, ఎన్టీపీసీ రామగుండం ఈడీ సునీల్‌కుమార్

**జ్యోతినగర్:** ఎన్టీపీసీ సంస్థలో మెరుగైన విద్యుత్ ఉత్పత్తి అంశాలపై ఆర్‌జీపీసీలో చర్చించారు. ఆదివారం కేరళ రాష్ట్రంలోని టికడిలో నిర్వహించిన ఆర్‌జీపీసీ సమావేశంలో ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, ప్రధానకార్యదర్శి కొలిపాక మల్లయ్య, బీఎంఎస్‌కు చెందిన సాగర్ రాజు, అధికారుల సంఘానికి చెందిన సోమ్లా బూక్యా, వంశీ, రాజేశ్ పాల్గొన్నారు. ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించిన చర్చల్లో రామగుండం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తితో పాటు చేపట్టాల్సిన రక్షణ చర్యలు, టౌన్‌షిప్‌లోని తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, ఏజీఎం(హెచ్‌ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్‌తో పాటు సదరన్ రీజియన్ ప్రాజెక్టుల అధికారులు పాల్గొన్నారు.

## మబ్బులతో రైతన్నల్లో గుబులు



ఎగ్లాస్‌పూర్ కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు

**రామగుండం:** వాతావరణంలో మార్పులు రావడంతో శనివారం అంతర్గాం మండల పరిధిలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకోవడం, అంతలోనే ఈదురుగాలులు వీయడంతో అన్నదాతల్లో మళ్లీ గుబులు మొదలైంది. అంతర్గాం మండల పరిధిలో సుమారు 14 కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తేమ శాతానికి చేరినప్పటికీ కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు కేంద్రాల వద్దనే నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే మూడురోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలవడం, ఆదివారం సెలవు రోజు కావడంతో సోమవారం దాకా కొనుగోళ్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కొనుగోళ్లలో వేగం పెంచాలని అన్నదాతలు కోరుతున్నారు.